## క్లుప్తంగా

### ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు



వార్షిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ రాము తెలిపారు. పథకానికి సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సర పనుల వార్షిక తనిఖీల అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ మేరకు ఏపీవో నాగేశ్వరరావు ఏడాది కాలంలో జరిగిన పనుల పురోగతిని, ఖర్చుపెట్టిన నిధుల వివరాలను సభాముఖంగా వివరించారు. గత ఏడాది 1594 పనులకు గాను రూ.12.69 కోట్లను ఖర్చుపెట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన రూ.87.574 రెక్టిఫికేషన్‌కు పీడీ ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సామాజిక తనిఖీ ప్రజావేదికలో సర్పంచులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, పథకం విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ ప్రఫుల్ కుమార్, డీఆర్‌పీ ధనలక్ష్మి, శ్రీకాంత్, రామచంద్రం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### చండీహోమంలో ద్రవ్యాలు సమర్పించిన బాలరాజు



చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కరాటం వై–జంక్షన్‌లో వేంచేసిఉన్న కనకదుర్గాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందగిరి విజయకుమార్ ఆచార్యులు, కందగిరి అశోక్ శాస్త్రి పర్యవేక్షణలో హోమగుండంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ద్రవ్యాలు సమర్పించి వేద ఆశీర్వచనాలు అందుకున్నారు. కొరెడ్ల వీర్రాజు, తాత రమణయ్య, కూరాకుల సత్తిబాబు, జెట్టిబోయిన ఆబయ్య దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు.పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, మధ్యాహ్నపు యేసు, తోటకూర శ్రీనివాస్, తారిపిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

### మండల పరిషత్ సమావేశం బహిష్కరించిన ప్రజాప్రతినిధులు



సమావేశం నుంచి బయటకు వచ్చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశాన్ని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు బహిష్కరించారు. సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు సమయానికి హాజరు కాలేదు. అలాగే సమావేశం జరుగుతున్న సమయంలో గత సమావేశంలో చర్చించిన అంశాలపై మినిట్స్ బుక్ తీసుకురావాలని సర్పంచులు అడిగారు. మినిట్ బుక్ లేదని ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి చెప్పిన సమాధానంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహించారు. అ సమయంలో మినిట్స్ బుక్ తీసుకురాకపోతే సమావేశం నుంచి బయటకు వెళ్లిపోతామని ప్రజాప్రతినిధులు చెప్పినా.. వెళ్లితే వెళ్లిపోండి అంటూ ఎంపీడీవో సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన సర్పంచులు, ఎంపిటీసీలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చారు. అలాగే వైఎస్ ఎంపీపీ గగ్గలోతు మోహన్‌రావుతోపాటు, సర్పంచ్ జోడే సత్య దుర్గాప్రసాద్‌లతో ఎంపీడీవో ప్రవర్తన సరిగ్గా లేకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో తీరుపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని సర్పంచులు, ఎంపీటీసీలు చెప్పారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: మైసన్నగూడెం 33కేవీ లైన్ మీద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పని నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం, వేలేరుపాడు, కుకునూరు, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**ద్వారకాతిరుమలలో...**

ద్వారకాతిరుమల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఆశాఖ ఏఈ నరసింహస్వామి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ద్వారకాతిరుమల, దొరసానిపాడు, తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

# మారుమూల గ్రామాలకూ మెరుగైన వైద్యం

**చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా**

జంగారెడ్డిగూడెం: మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణకు ఖర్చు పెట్టలేని స్థితిలో ఉన్న ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించి వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందించడమే కాకుండా, ప్రతినెలా అవసరమైన మందులను వ్యాధులు నయం అయ్యేంత వరకు ఉచితంగా ప్రభుత్వమే అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కన్వీనర్ బీవీఆర్ చౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, మేడవరపు విద్యాసాగర్, జిల్లా వైద్యవిభాగం కార్యదర్శి కరారి సీతారాంబాబు, బత్తిన చిన్న, జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

**521 మందికి వైద్యసేవలు**

పట్టణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో అశ్వారావుపేట –2 సచివాలయం పరిధిలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 521 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

**ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణే ధ్యేయం**

లింగపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు చేతుల మీదగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునుసూరి వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, పార్టీ నాయకులు రావి కొండయ్య, మండలపు నరశింహరావు, పి వేమనరెడ్డి, కె రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



కొయ్యలగూడెం: పరింపూడిలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**పరింపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష**

కొయ్యలగూడెం: పరింపూడి సచివాలయం–3 పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యసేవలు పొందిన రోగులకు ప్రజాప్రతినిధులు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, టౌన్ కన్వీనర్ సంకుకొండ, సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాము, పాల్గొన్నారు. శుక్రవారం రాజవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈవో సీహెచ్ సత్యనారాయణ పేర్కొన్నారు.

**నామవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష**

చింతలపూడి: ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఉపయోగపడతాయని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నామవరం సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలా బేగం, సర్పంచ్ జరబలా వెంకటేశ్వరావు, ఎంఈఓ –2 కిరణ్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష**

కామవరపుకోట: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. గురువారం వీరిశెట్టిగూడెం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఒక్క కుటుంబం కూడా అనారోగ్యంతో బాధపడకూడదు అనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి, ప్రతి గడపకూ వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను పంపించి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని మందులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ దేవరపల్లి రామమోహన్‌రావు, ఎంపీటీసీ బొప్పన చైతన్య, ఎంపీడీఓ కంతేటి శ్రీదేవి, ఎంఈఓ చిన్నం ప్రశాంత్ కుమార్, మండల వైద్యాధికారులు డాక్టర్ సునీల్ వర్మ, డాక్టర్ రమేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

ద్వారకాతిరుమల: జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పలువురు రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ యర్రగొల్ల రజని, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆచంట రాకేష్, బొళ్ల శ్రీను, ఘంటా శేఖర్, బొండాడ వెంకన్నబాబు, అల్లాడ హరేరామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, షేక్ భాషా, దాసరి ఏసురత్నం తదితరులున్నారు.



ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి



జంగారెడ్డిగూడెం: ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వృద్ధుడికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



లింగపాలెం: రంగాపురంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్లు అందజేసిన ప్రజాప్రతినిధులు



చింతలపూడి: నామవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం



కామవరపుకోట: వీరిశెట్టిగూడెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా వైద్యసేవలు

వేలేరుపాడు: రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు వైద్యం అందక బాధపడకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం వేలేరుపాడు మండలంలోని నార్లవరం సచివాయల పరిధిలో సర్పంచ్ మడివి రంగమ్మ అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందించేలా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే, ఆయన బాటలో నడుస్తున్న ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం చేయించుకోలేని స్థితిలో పేదలు బాధపడకూడదన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గత ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సిబ్బంది లేక సరైన మందులు లేక రాష్ట్రంలోని సామాన్యులకి సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చడంతో పాటు అవసరానికి తగ్గట్టు సిబ్బందిని నియమించారన్నారు. ప్రతి మారుమూల పల్లెల్లో కూడా వైద్యం అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఆంధ్రరాష్ట్రంలో పేదలకు అందిస్తున్న వైద్యాన్ని చూసి మేధావులు సైతం ముఖ్యమంత్రి పనితీరును మెచ్చుకుంటున్నారన్నారు.

**నూతన సచివాలయం, ఆర్బీకే సెంటర్ ప్రారంభం**

మేడేపల్లిలో రూ.42 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.26 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, రామవరంలో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభించారు.



మేడేపల్లిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**గడపగడపకు మన ప్రభుత్వం**

మేడేపల్లి సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్నారన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారికి పథకాలు వచ్చేలా చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్న ఆయన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ, తహసీల్దార్ ఎలీశా, ఎంపీడీఓ మూర్తి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాడ్ల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేశగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాసర్, సచివాలయల మండల కన్వీనర్ కొలూరి సత్యరాజ్, వైస్ ఎంపీపీ మేడవరకు నాగశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార స్టాల్ ప్రారంభం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సంపూర్ణ పోషక ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తున్నారని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రాజెక్టు పీవో యుఏన్ స్వర్ణకుమారి, సూపర్‌వైజర్ నయోమీరాణిల ఆధ్వర్యంలో తయారుచేసిన నలభై రకాల పోషకాహార వంటల నాణ్యత పరిశీలించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ, సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏలేటి చిన్న తుక్కయ్య పాల్గొన్నారు.

# సంక్షేమాభివృద్ధికి చిరునామా సీఎం జగన్

జంగారెడ్డిగూడెం: సంక్షేమాభివృద్ధికి చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. గురువారం స్థానిక ఆలపాటి గంగా భవానీ కళ్యాణ మండపంలో రూరల్ మండల వలంటీర్లు, గృహసారథులకు వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే ఎలీజా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. రూ. 2.38 లక్షల కోట్లు సీఎం జగన్ ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడం ఒక రికార్డు అన్నారు. రాష్ట్రంలో 1.6 కోట్ల కుటుంబాలు, 5.30 కోట్ల మంది ప్రజలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించారన్నారు. 87శాతం కుటుంబాలు జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందారని పేర్కొన్నారు. వలంటీర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి జగనన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలో వివరించి చెప్పాలన్నారు. 33 లక్షల ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, పాఠశాలలు, ఆసుపత్రులు అభివృద్ధి చేశారని, నవరత్నాలు అమలు చేస్తున్నారని, 13లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు విశాఖ సమ్మిట్‌లో సాధించారని, ఇలా అన్ని పథకాలను ప్రజలకు వివరించి, జగనన్న అవసరం రాష్ట్రానికి ఉందని వివరించాలన్నారు. ప్రజారంజకంగా పాలించే సత్తా జగన్‌కు ఉందని, రాబోయే రోజులు హ్యాపీ ఆంధ్రా కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ గురజాల పార్థసారధి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, వైద్యవిభాగం జిల్లా కార్యదర్శి కతారి సీతారాంబాబు, మద్ది డైరెక్టర్ మలీ్నడి బాబి, హెచ్‌డీఎస్ డైరెక్టర్ కనపర్తి రాజేష్, గంజి వినోద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

**నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి**

జంగారెడ్డిగూడెం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో అర్హులైన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు అనేక పథకాలను ప్రవేశపెట్టి పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో పెన్షన్లు పొందాలంటే దూరప్రాంతంలో ఉన్న కార్యాలయాలకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ ప్రగడ వెంకటలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు కేతినేని బాలు, ప్రగడ సోంప్రకాష్, మళ్నీడి బాబి, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బేబీ కమల, హెచ్‌డీఎస్ సభ్యులు భావన రుషి, కనుపర్తి రాజేష్ తెలిపారు. గురువారం ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీ ఎంఐడీసీ నుంచి ఆసుపత్రి నిర్వహణ కోసం రూ.27 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధుల నుంచి ఆసుపత్రికి పెయింట్‌లు, కాటిల్ రైలింగ్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూమ్, ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డులు, ప్రతిరూమ్ వద్ద చెప్పుల స్టాండ్‌లు, ట్రాక్‌లు, దోబీగాట్‌లు, షెడ్‌లు, పైప్‌లైన్‌లు, డ్రెయిన్‌లు, 8 వాటర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ సెట్టింగ్‌లు తదితర పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రూ.2 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. 2022–23 వరకు ఆసుపత్రికి 4 మెరిట్ సర్టిఫికెట్‌లు సాధించినట్లు చెప్పారు. కాగా, సెప్టెంబర్‌లో 8,759 మంది ఓపీ, 1,763 మంది ఇన్‌పేషెంట్‌లు వైద్యసేవలు పొందారని 122 డెలివరీలు నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ వజ్రకిరణ్, ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ శ్రీనివాసరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశేషాలంకరణల్లో అమ్మవార్ల దర్శనం



జంగారెడ్డిగూడెం: శ్రీ లలితా త్రిపుర సుందరిగా గంగానమ్మ




కొయ్యలగూడెం: చండీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ



చింతలపూడి: సరస్వతీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీ మాత



పోలవరం: మహాచండీదేవిగా కనకదుర్గమ్మ దర్శనం



టి.నరసాపురం: మహాలక్ష్మి అవతారంలో విశాలాక్షి



జంగారెడ్డిగూడెం: శ్రీ మహాలక్ష్మిగా ముత్యాలమ్మ తల్లి దర్శనం

దేవీ శరన్నవరాత్రులు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు గురువారం దుర్గమ్మ విశేషాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించింది. లలితా త్రిపుర సుందరి దేవిగా, మహాలక్ష్మిగా, కాత్యాయినిగా, శ్రీమహాచండీ దేవిగా, సరస్వతీ మాతగా దర్శనమిచ్చి పూజలందుకుంది. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో పూజలందుకోగా, నూకాలమ్మ, ముత్యాలమ్మ మహాలక్ష్మిగా భక్తులను కరుణించారు. వాసవీ మాత కాత్యాయిని దేవిగా దర్శనమిచ్చింది. కొయ్యలగూడెం, కన్నాపురంలలో చండీదేవి అలంకరణతో అమ్మవారు పూజలందుకున్నారు. బయ్యనగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిగా, వాసవి కన్యకా పరమేశ్వరి స్కంద పూజలు అందుకున్నారు. చింతలపూడిలోని విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరీ అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తులను కటాక్షించారు. పోలవరంలో చండీదేవిగా దర్శనమివ్వగా టి.నరసాపురంలోని విశాలాక్షి అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చింది. ఆయా ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్